# ఆశాపాశం

"నువ్వు జాగ్రత్తగా ఉండాలయ్యా!" అని చెప్పారు రామయ్య గారు శోభనాచలానికి. శోభనాచలం దిగులు పడలేదు కాని,నిరుత్సాహ పడ్డాడు. ఇంకా నలభై ఏళ్ళు కూడా నిండలేదు తనకి. తన ఆరోగ్యంలో ఏదైనా తేడా వస్తుందని కాని, రావడానికి అవకాశం ఉందని కాని అతడు కలలో కూడా అనుకోలేదు. మరైతే ఎందుకిలా జరిగింది అనేదే అతడి ఆవేదన. దానికి డాక్టరేం చెపుతాడు? ఉన్న పరిస్థితిని గూర్చి చెప్పటమే కాని జాతకాలు చూడరు కదా! జాతకం గురించి చెప్పరు కద! పది సంవత్సరాలుగా ఏ పరీక్షా చేయించుకోలేదనీ డాక్టరు దగ్గరకు ఏ రెండు మూడుసార్లో తప్ప వెళ్ళలేదనీ చెపితే ఈసారి ఆశ్చర్యపడటం డాక్టరు రామయ్యగారి వంతైంది.

"ప్రతి ఏడాదీ ఒకసారి డాక్టరు దగ్గర పరీక్ష చేయించుకోవడం మంచిదని మీకెవరూ చెప్పలేదా?" అన్నారు, శోభనాచలం యిచ్చిన ఏభై రూపాయల నోటును అలవోకగా, ఎటువంటి ఆసక్తి కనపడ నీయకుండా అందుకుంటూ.

"అనుమానం రాలేదు, అవసరమనుకోలేదు" అన్నాడు శోభనాచలం.

"అదే మీతో వచ్చిన చిక్కు. రోగం పూర్తిగా బయటపడితే గాని డాక్టరు దగ్గరకు రారు" అన్నారు డాక్టరుగారు.

'వచ్చిన రోగాల పరీక్షలు చేయించుకోడానికే వస్తున్నాం. రోగం ఉందోలేదో పరీక్ష చేయించుకొని కూడా ఎక్కడ చావం' అనుకున్నాడు, తనను ఎప్పుడు పిలుస్తాడా అని ఎదురుచూస్తున్న ఇంకో

పేషెంటు ఈ మాటలు వింటూ. శోభనాచలం మొగం చిన్నబుచ్చు కోవడం చూసి డాక్టరుగారు కొంచెం అనునయంగానే అన్నారు. "తాతకో తండ్రికో ఇటువంటి లక్షణం ఉంటే తనకు వచ్చే అవకాశం ఉంది. అదీకాక టెన్షన్‌వల్ల, ఎటెన్షన్ లేకపోవడంవల్ల కూడా నడివయసు గడిచిపోతున్నదనగా వచ్చే అవకాశం ఎక్కువ. మరేం పరవాలేదు. ఇది జబ్బు అనుకోనక్కరలేదు. శరీరంలో స్రవించాల్సిన ఎంజైముల లోపంవల్ల వస్తుంది ఇది. తీపి తినకూడదు, బాగా వ్యాయామం చెయ్యాలి, ఉదయమే లేచి ఎంత దూరం నడిస్తే అంతమంచిది" అని చల్లగా తేల్చి చెప్పారు డాక్టరుగారు.

రోజూ ఉరుకుల పరుగుల మీద ఆఫీసు బస్సు పట్టుకోవడం, సాయంత్రం ఉస్సురస్సురంటూ ఇల్లు చేరడం, అలసిపోవడం, నిద్ర రాకపోవడం, పిల్లలమీద జాలి, పెళ్ళాం మీద అలుకా- ఇక ఏం వ్యాయామం చేస్తాను నా బొంద అనుకున్నాడు శోభనాచలం. ప్రతి నెలా విడిగా పరీక్ష చేయించుకోవాలట. ఇది మరీ విసుగనిపిస్తున్నది. ఈ మాత్రలు వాడి, పదిరోజుల తర్వాత మళ్ళీ కన్పించండి అని చెప్పాడు డాక్టరుగారు.

సరేనని నిర్లిప్తంగా వచ్చేశాడు. ఇంట్లో పిల్లలు నిద్రపోయారు కదా అని అలివేలుతో రహస్యంగా చెపితే ఆవిడ దిగులుపడింది. మర్రోజు ఆఫీసుకు వెళుతున్నప్పుడు పిల్లలు బిక్కమొహాలతో చూశారు తండ్రిని! తల్లి చెప్పింది కాబోలు-

ఆఫీసులో కోక్లర్కు లోకనాథానికి చెప్పినప్పుడు "ఒరే శోభా. ఏం దిగులు లేదురా! మీ యిల్లు ఎలాగూ ఊరి చివర ఉంది కాబట్టి రోజూ పొద్దున్నే ఐదారు కిలోమీటర్లు నడవటం అలవాటు చేసుకోరా! ఏ విషయం గురించీ ఉద్రేకపడవద్దు. ఆఫీసర్ భాషణంతో గొడవ పడొద్దు. నిర్లక్ష్యంగా నిబ్బరంగా ఉండడం నేర్చుకోవాలోయ్! సంతోషం

ఎట్లాగూ మన మొహాల లేదోయ్! కాబట్టి...." అని ఆఫీసు దంత వేదాంతం బోధించాడు.

అలా ప్రారంభమైంది శోభనాచలం ఉదయకాల నడకోదంతం. ముందు పది రోజులు ఉత్సాహంగా లేదు. విసుగనిపించింది. కపరకపర చీకటితో లేస్తేగానీ అన్ని పనులు పూర్తి చేసుకుని, ఆఫీసుకు చేర్చే బస్సు పట్టుకోలేడు. ఉప్పూకారం తగ్గించడానికి, చక్కెరలేకుండా విడిగా కాఫీ ఇవ్వడానికి వాళ్ళావిడ అలివేలు బాధపడుతున్నదని గ్రహించక పోలేదు శోభనాచలం.

'నువ్వుకూడా నాతో నడిస్తే బాగుండును కదా!' అంటే అవిడ 'నడేలే సంబండం' అంటుంది కాని, అందులోని సబబును అర్థం చేసుకో లేదు. అలరింపులు, అర్థింపులూ ఏనాడో వెనకబట్టాయి. సాధింపులు తరచైనాయి- పిల్లలకి అది లేదని, ఇది లేదని, అవసరాలు పట్టించు కోవడం లేదని....శోభనాచలానికి పది రోజుల తర్వాత ఒంట్లో ఏదో కొత్త ఉజ్జీవం చోటుచేసుకుంటున్నట్లనిపించింది. రోడ్డు రెండువైపుల తురాయి చెట్లు. కానుగుచెట్లు పలకరిస్తాయి. ప్రభాత వాయువులు పులక రింప చేస్తాయి. నలుపు మబ్బులు ఎరుపు పులుముకుంటూ తూరుపు దిక్కున హడావుడి చేస్తుంటాయి. వెన్నెల రాత్రులయితే పాలిపోయిన చంద్రుడు ఒక మూల నుంచి 'ఏం మిత్రమా?' అంటాడు. సుఖనివాస్ ఎపార్ట్‌మెంట్స్ దాటగానే న్యూయార్క్ హెయిర్ డ్రెస్సర్స్ సైన్ బోర్డు మీద ఉన్న సాయిబాబా పలకరిస్తాడు. శోభనాచలానికి రోజూ నవ్వొస్తుంది. ఎందుకంటే, న్యూయార్క్‌ను సాగర్‌రోడ్డుకు తీసుకొని వచ్చాడా భావుక కేశాలంకారుడు. ఆ జుత్తు కత్తెర శిల్పి ఎలా ఉంటాడో చూదామంటే తాను తిరిగి వచ్చే తరుణంలో కూడా ఆ షాపు తెరవటం జరగదు.

మూడు కిలోమీటర్లు నడిచిన తర్వాత ఉల్లాసపురం చెరువు దూరాన కనపడుతుంది. ఆ చెరువు దగ్గరకు వెళ్ళాలనిపిస్తుంది కాని, నిత్యకార్యక్రమానికి ఆలస్యం తోడవుతుందేమోనని జంకు. అక్కడ రోడ్డు మిట్టపైకి ఎక్కుతుంది. సాధారణంగా శోభనాచలం అక్కడకు వచ్చేసరికి ఎదురుగా పద్దయ్యగారు చిన్నపరుగువంటి నడకతో ఎదురై రోడ్డుకు ఒక చివరన క్షణంలో ముందుకు వెళతారు. ఆయన ఆ చిరు పరుగు నడక చిత్రంగా ఉంటుంది. అది నడకా కాదు. పరుగూ కాదు. ఎడమ చేయి మోచేతి దగ్గర ఒక కోణంలో పైకి వాలుగా ఎత్తుకొని ఉంటారు. అరచేతిలో చిన్న ట్రాన్సిస్టరు. కుడిచేతిలో చేతి కర్ర. ఈ చేతికర్ర కూడా అడ్డంగా ఒక కోణంలో కుడిచేతిలో పట్టుకుంటారు. ఇక కదం తొక్కుతున్నట్లు కుడి-ఎడమ పాదాలు ముందుకు వేస్తూ ఒక రకమైన పరుగులాంటి నడకతో సాగుతారు. ఎంతదూరం వెళ తారో, వెళ్ళేప్పుడుకూడా ఆయన ఇట్లానే వెళతారో లేక తిరుగునడకలో ఇట్లా చిన్న పరుగందుకుంటారో శోభనాచలం ఎప్పుడూ గమనించ లేదు. కాని,నెలరోజులు గడిచినా ఆ దృశ్యం మాత్రం రోజూ ఎదురవు తూనే ఉంది అతడికి. మొదట చాలా ఆశ్చర్యమనిపించింది. పదిరోజుల తర్వాతగాని పద్దయ్యగారిని గుర్తుపట్టలేకపోయాడు శోభనాచలం. తన కప్పుడు పదిహేనేళ్ళు. జయాటాకీసు వీధిలో పద్దయ్యగారింటి పక్కనే ఉండే వాళ్ళు తామప్పుడు. స్కూలు ఫైనలు చదువుతూ ఉండేవాడు తాను. సరస్వతమ్మ పిన్నిగారు చాలా కలుపుగోలు మనిషి. ఆమే ఈ అలివేలు సంబంధం తనకు తెచ్చింది. ఇరవై ఏళ్ళ దాటిపోయింది తాను గుడివాడ వదిలిపెట్టి. తర్వాత పద్దయ్యగారిని తాను చూడలేదు. ఆయనకప్పుడు ఇద్దరాడపిల్లలు- పదేళ్ళపిల్లా ఎనిమిదేళ్ళ పిల్లాను. తర్వాత ఇంకెవరైనా పిల్లలున్నారేమో తెలియదు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంటులో ఏదో చిన్న ఉద్యోగం చేసేవాడు పద్దయ్యగారు. ఆయన చాలా అమాయకంగానూ ఇరుగుపొరుగు కష్టసుఖాలలో ఆదుకునేవాడు

గానూ ఉండేవారు. చాలా కొద్ది తాకిడితో పక్షవాతం వచ్చినట్టున్నది ఆయన్ను చూస్తుంటే. ఒకవైపు కొంచెం వొంగినట్లు కన్పిస్తుంది.

ఆయన తనవేపు చూస్తారేమో అనుకుంటాడు శోభనాచలం. కాని, ఆయన లోకమే ఆయనది. అటూ ఇటూ చూడరు. రోడ్డంతా చాలావరకు నిర్మానుష్యంగానే ఉంటుంది. ఒకటో రెండో లారీలు. వరసగా నాలుగైదు కట్టెల పేర్పు ఎద్దుబండ్లు కనపడతాయి. పద్దయ్యగారు జల్లుపడినాసరే లెక్కచేయకుండా యథావిధిగా ఉదయ కాలపు నడక కార్యక్రమం మానుకోకుండా సాగిస్తున్నట్లు గమనించాడు శోభనాచలం. ఏమంటే ఓరోజు సన్నటి తుప్పరపడుతున్నది. ఇంటి దగ్గర బయలుదేరుతున్నప్పుడే ఈ తుప్పర ఉంటే తాను కాలు సారించకనే పోయేవాడు. న్యూయార్క్ హేర్ డ్రెసర్స్ దగ్గరకు వచ్చేసరికి సన్నగా తుప్పర ప్రారంభమైంది. ఆకాశం ఎటుచూసినా తడి ఊదా ముద్దగా మూసుకొని ఉంది. లేత నలుపు ఇంకా విరగలేదు. రోడ్డు మిట్ట దగ్గర ఒక చేతిలో అడ్డంగా గొడుగును ఒక కోణంలో ఎత్తిన కుడిచేతిలో పట్టుకొని, రెండో చేతిని పైకి జాపి అందులో చిన్న ట్రాన్సిస్టర్‌తో పద్దయ్యగారు ఎదురై ముందుకు వెళ్ళారు. ఆయన ఎంత ఖచ్చితంగా దినచర్య సాగిస్తున్నాడో అని శోభనాచలానికి ఆశ్చర్యమైంది.

సాధారణంగా మిట్టపైకి ఎక్కేటప్పటికి మబ్బులు మూయకపోతే సూర్యోదయం అవుతూ ఉంటుంది. సూర్యోదయం కనక చూడగలిగితే చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ తర్వాత ఒకటి రెండు కిలోమీటర్లు వెళతాడు శోభనాచలం- వోపికనుబట్టి, ఉత్సాహాన్నిబట్టి. మళ్ళీ తిరిగి వచ్చేప్పుడు చెమటతో తడిసిన వీపు మీద గిలిగింతలు పెడుతూ ఉంటుంది ఉదయకాలపు ఎండ. ఒక అంచున నడుస్తుంటే పక్కన గరికపైన మంచు బిందులు మెరుస్తుంటాయి. చీమలు బారుకట్టి గంభీ

రంగా ఎక్కడికో వెళుతుంటే నవ్వొస్తుంది. పట్నానికి పాలు తీసుకుపోయే సైకిళ్ళు హడావుడిగా ఎదురవుతుంటాయి. వానకారు ముగిసి శీతకాలం ప్రవేశిస్తుండగా శీతాఫలాల ఎద్దుబళ్ళు లెక్కలేనన్ని ఎదురవుతుంటాయి. శోభనాచలానికి ఆశ్చర్యమనిపిస్తుంది- రోజూ ఇన్ని బళ్ళు ఎలా రాగలుగుతాయా అని. చిన్న చిన్న ట్రక్కుల నిండా రోజూ కట్టెలు ఎదురవుతాయి- ఎద్దుబళ్ళుకాక. రోజూ ఇన్ని చెట్లు వీళ్ళకు ఎక్కడ దొరుకుతాయో అనుకుంటాడు శోభనాచలం. మనసుకి కష్టమనిపిస్తుంది. మానవుడి స్వార్థానికి, ఆబకు, అత్యాశకు అంతులేకుండా ఉంది. రాత్రిళ్ళు దొంగతనంగా చెట్లు కూలుస్తారు కాబోలు! తెల్లవారక ముందే,చీకటి విరియకముందే ఈ కట్టెలబళ్ళు నగరంలో గమ్యస్థానాలు చేరుతాయి కాబోలు! నగరానికి కూరగాయలు తీసుకొని వెళుతున్న ట్రక్కులు కనపడతాయి. నాగార్జున సాగర్ రోడ్డుమీద చంపాపేట దాటిన తర్వాత రోజూ ఎదురయ్యే దృశ్యాలివి. శోభనాచలం అలవాటు పడ్డాడు.ఏ రోజునైనా ఉదయకాలపు నడకకు భంగం కలిగితే ఆ రోజు కాస్త చిరాకుగా ఉన్నట్లనిపిస్తుంది. న్యూయార్క్ హెయిర్ డ్రెసర్స్ సైన్‌బోర్డు మీది సాయిబాబా మర్రోజు సంజాయిషీ అడుగుతున్నట్లనిపిస్తుంది.

ఆశకు అంతులేదు. రోడ్డుకు రెండు వైపులా కొత్త కాలనీలు ఎన్నో వస్తున్నాయి. అక్కడో ఇల్లూ అక్కడో ఇల్లూ. పెద్ద భవనం. ప్లాట్లూ తయారవుతున్నాయి. కొన్నాళ్ళకి ఉల్లాసపురం చెరువు కనపడదేమో. కోళ్ళఫారాలు వస్తున్నాయి. ఒకటే కలకలం. ఇంకా కొంచెం ముందుకుపోతే 'ఆగి చూచి జాగ్రత్తగా వెళ్ళవలెను' అనే దారి హెచ్చరిక బోర్డు. అది దాటుతుంటె భయం. నింపాదిగా చూసి వెళతాడు. ఇది ఎలా దాటతాడో పద్దయ్యగారు అనిపిస్తుంది. ఇరుకు వంతెనపైన మరీ ఇరుకు రోడ్డు ఆ భాగం. అది దాటితే దానిమ్మవనం వస్తుంది. ఎన్ని దానిమ్మ చెట్లో! విశాలమైన ఆవరణలో, ఎర్రటి

పువ్వులతో చూడటానికి ఆనందమనిపిస్తుంది. అక్కడదాకా వెళ్ళేసరికి మగ్గిన టొమాటో పండురంగు నుంచి సింధూర వర్ణానికి మారతాడు సూర్యుడు. ఇక అక్కడనుంచి తిరుగు నడక ప్రారంభిస్తాడు శోభనాచలం. ఆర్నెల్లుగా ఇది అతడి దినచర్య.

ఆ సంఘటనే జరక్కపోతే పద్దయ్యగారి గురించి తెలిసేదికాదు. రెండు రోజులు ఆయన కనపడకపోయేసరికి చాలా ఆశ్చర్యమనిపించింది శోభనాచలానికి. ఉదయం ఏనాడైనా సూర్యుడు కనపడకపోతే ఆశ్చర్యమనిపించదు కాని,పద్దయ్యగారు కనపడకపోవడమేమిటి? అంతరాంతరాలలో ఏవో దైన్యపు ఊహలు కదలాడాయి. ఆయనకు వొంట్లో బాగులేదేమో! ఇక కనిపించరా? మామూలుగా ఆయన సాగే అంచువేపు చూస్తూనే నడిచినా ఆయన కనిపించలేదు ఆ రెండురోజులు. మూడో రోజున మిట్ట ఎక్కుతుండగా ఆయన కనిపించారు. క్రితం రాత్రి బాగా వర్షం పడింది. రోడ్డుమీద నీటి మడుగులున్నాయి. మట్టి కూడా కొట్టుకొని వచ్చింది. ఇంత ఆలస్యం చెయ్యరే పద్దయ్యగారు! ఇవాళ ఇంకా ఇక్కడే ఉన్నారే! నిన్నా, మొన్నా ఎందుకు రాలేదు అని అడుగుదామని కొంచెం పెద్ద అంగలు వేశాడు శోభనాచలం. అయ్యో, అయ్యో ఏమైంది? ఒక్క ఉదుటున ఆయన్ను పట్టుకున్నాడు శోభనాచలం. ఇంకానయం, పూర్తిగా ఆయన పడిపోలేదు. కాలుజారి ఒకవైపు కొంచెం సాగింది. ఇంతలో పట్టుకోబట్టి సరిపోయింది. లేకపోతే ప్రమాదకరమైన దెబ్బ తగిలేదేమో! ఆయన గసపెడుతున్నారు. భయపడినట్లున్నది.

నాలుగడుగులలోనే బస్ షెల్టర్ ఉంది. పైన రేకులు తునాతునకలైనా చిన్నగట్టు మాత్రం ఉంది. నెమ్మదిగా ఆయన బరువంతా తనమీద మోపుకొని గట్టుదగ్గరకు చేర్చాడు ఆయన్ని. ఆయన చూపుల్లో 'రక్షించావు బాబూ!' అనే దైన్యం కనపడుతున్నది. "కొంచెంసేపు

విశ్రాంతి తీసుకోండి. వెనక్కు వెళ్ళిపోదాం. ఏదైనా రిక్షా కనపడితే మిమ్మల్ని ఎక్కిస్తాను. లేదా, నేను మీ ఇంటిదాకా వచ్చి దిగవిడుస్తాను" అన్నాడు శోభనాచలం. ఆయన స్థిమితంగా సర్దుకున్నట్లు చూస్తూ "ఏం ఫరవాలేదు బాబూ! ఏదో తొక్కమీద కాలుపడి కొంచెం జారి నట్లుంది, అంతేను" అన్నాడు. "పోనీలెండి, కాసేపు విశ్రాంతి తీసుకుంటే రిక్షాగాని, ఆటోగాని ఇటువేపు కనపడుతుందేమో చూదాం. మీరు పద్మ నాభయ్యగారని నాకు తెలుసు. మీరు నన్ను గుర్తుపట్టలేదు. ఆర్నెల్ల నుంచి చూస్తున్నాను. కాని, నేను దగ్గరయ్యే సరికి మీరు ఊగుతూ పరి గెత్తుతుంటారు. మిమ్మల్ని ఆపటం ఇష్టమయ్యేదికాదు. గుడివాడలో మనం పక్క పక్కన ఉండేవాళ్ళం. జయాటాకీసు వీధిలో, పీధికొళాయి పక్కన గురుబ్రహ్మంగారి ఇంట్లో రెండు పోర్షన్లలో ఉండేవాళ్ళం. రామసుబ్బయ్యగారి కొడుకుని నేను - శోభనాచలాన్ని. ఇరవై యేళ్ళ యినా నేను మిమ్మల్ని బాగానే గుర్తుపట్టగలిగాను. మీరు బాగా తీసి పోయినారు. మీ అమ్మాయిలిద్దరికీ పెళ్ళిళ్ళయినాయా? మీరెక్కడుంటు న్నారు? హైదరాబాదులో ఇల్లు కట్టారా?" అని ఆయన ఆశ్చర్యంతో కళ్ళు విప్పార్చుకొని చూస్తుండగా అడిగాడు శోభనాచలం. "కూచో బాబూ!" అని కాస్త జరిగి పక్కన చోటు చూపించాడు పద్దయ్యగారు.

"అవును ఇప్పుడు గుర్తువస్తున్నది....మీ అమ్మా నాన్నా బాగు న్నారా, ఏం ఉద్యోగం చేస్తున్నావు, ఎక్కడుంటున్నావు?" అని అడిగా రాయన.

"మీ సంగతి చెప్పండి. నేను సెక్రెటేరియట్‌లో పని చేస్తు న్నాను. యాదగిరి టాకీస్ వెనకాల ప్రేమనగర్ కాలనీలో ఉంటు న్నాను. అమ్మానాన్నా పెద్దవాళ్ళయిపోయినారు. విజయవాడలో తమ్ముడి దగ్గర ఉంటారు. నాకిద్దరు పిల్లలు."

"నాయనా శోభనాచలం ఇన్నాళ్ళకు నిన్ను చూడటం సంతోషంగా ఉందోయ్. నేను రిటైరైపోయి పదేళ్ళయింది. మీ పిన్ని పోయింది. నా రిటైర్మెంటుకు ముందే పోయింది. నా సంగతి ఏం చెప్పమంటావు? మా శాంతకు పెళ్ళికాలేదు. చిన్నది భవాని తానే పెళ్ళి చేసుకుంది గుడిలో మెల్ల. వాళ్ళు బాగానే బతుకుతున్నారనుకో.

"పెద్దపిల్ల చాలా అమాయకురాలు. లోకం సంగతి తెలీదు. చీపురుపల్లిలో, పెద్దాపురంలో, ఖమ్మంలో ఉద్యోగరీత్యా ఉండవలసి రావడంతో శాంత చదువు సరిగా సాగలేదు. ఈ ఊరొచ్చిన తర్వాత టైపూ, షార్టుహేండ్ నేర్చుకుని భవాని బ్యాంకులో ఉద్యోగం తెచ్చుకుంది. శాంత అలానే ఉండిపోయింది. ఇంటి బాధ్యత అంతా శాంత నెత్తినే పడింది. ఎవరింటికైనా ఎంతో వన్నెతెచ్చే పిల్ల. ఎంత పొదుపుగా యిల్లు దిద్దుతుందో ఆ చాకచక్యం మనం ఎక్కడా చూడం. తల్లి తీసుకొని చనిపోయింది. చిన్నపిల్ల చెప్పాపెట్టకుండా పెళ్ళిచేసుకొని వెళ్ళిపోయింది. తనుకూడా పెళ్ళిచేసుకొని వెళ్ళిపోతే నన్నెవరు చూస్తారంటుంది పిచ్చిపిల్ల శాంతమ్మ. నా పెన్షన్ చూసైనా నన్ను అల్లుడు వెళ్ళగొట్టడులే అమ్మా, అదీకాక నీకు పెళ్ళయితే చాలు-నేను హాయిగా తనువు చాలించగలను. ఇక నేను ఉద్ధరించాల్సిందేముంది— అంటే వినదు.

నా బెంగంతా మా శాంతను గురించే శోభనాచలం! అది తెలివైంది కాదు. తెలివైనవాళ్ళు ఇతరుల కోసం బతకరు. తమ కోసమే బతుకుతారు. అవసరమైతే ఇతరులను చంపుతారు కూడా. మా భవాని చూడు. అది తెలివైంది. అది అట్లా ఇంట్లో చెప్పాపెట్టకుండా పెళ్ళి చేసుకున్నందువల్లనే వాళ్లమ్మ దిగులుతో చచ్చిపోయింది. చిన్నదలా చేసిందని పెద్దదానికి సంబంధాలు చూసినప్పుడు పెళ్ళి చూపులకు వచ్చినవాళ్ళు ఆరాలు తీసేవారు. ముందుగానే ఎవరివల్లనైనా తెలిస్తే ఆక్షేపించేవాళ్ళు. శాంతకిప్పుడు ముప్పయి ఏళ్ళు దాటాయి. పెళ్ళి ఎలా అవుతుంది? దానికి నేను దిక్కు. నాకు అది దిక్కు.

"పోనీ, నేను సంపాదించి కూడబెట్టానా అంటే అదీ లేదు. పిరికితనమనుకో భయమనుకో లంచాలు తీసుకోలేదు. గడ్డివాములో కుక్క—ఎందుకని తరిమికొట్టారు. నేను తిననసీ తమను తిననివ్వననీ ఒకచోట కాదు ప్రతిచోటా నన్ను ఎద్దేవా చేసేవాళ్ళు. అసహనంగా చూసేవాళ్లు. అనరాని మాటలనేవాళ్లు. పోనీ, వాళ్ళకు విధేయుడిగా వాళ్ళు మెచ్చుకునేట్లు ఉందామా అంటే అట్లా చేయలేకపోయేవాణ్ణి. నా దగ్గరనుంచి ఫైలు వెళ్ళగానే పై అధికారి తొక్కిపట్టేవాడు. కంట్రాక్టర్లనుంచి డబ్బు వసూలు చేసేవాడు. పోనీ, వాళ్ళు ఎట్లా ఏడ్చుకుంటే నాకేమని నేనూరుకున్నా నాపై కక్షగట్టేవాళ్ళు. నాకు రావలసిన ప్రమోషన్ ఒక్కటీ రాలేదు. ఇరవై అయిదేళ్ళ సర్వీసులో రెండుసార్లు డిమోషన్ మాత్రం వచ్చింది. పనికిరాని పద్దయ్య అని పేరుపడింది. పిల్లలకూ సంసారానికీ కూడా నేను పనికిరానివాణ్ణే అయిపోయాను. శరీరంకూడా నాపై కోపగించుకుంది. ఏమంటే, దాని బాగోగులు ఎప్పుడూ చూడలేదుకదా! మైల్డుగా స్ట్రోక్ వచ్చింది ఆర్నెల్లు మంచం పట్టాను. నా రెండోపిల్ల వచ్చి చూసికూడా పోలేదు. నా పెన్షన్ పేపర్లు మంజూరు కావడానికి మూడేళ్ళు పట్టింది.

"ఇంకొక తమాషా చూశావా? ఈ విషయాలు పెద్దవాళ్ళ దగ్గర కాని,చిన్నవాళ్ల దగ్గర కాని చెప్పుకుంటే ఈసడింపు,నవ్వుకనబరచడం నాకు మరింత బాధనిపించేది. ఒరి నీ అమాయకం కాల-చచ్చుపీనుగా! అన్నట్లు చూసేవాళ్లు. నేనే ఏదో అసమర్థుణ్ణనీ వాజమ్మననీ లోకం సంగతి తెలిసి మసులుకోవటం చాతకాని వాణ్ణని, రోజులనుపట్టిపోవాలి, నేను నీతిమంతుణ్ణి అంటూ నీలుక్కుంటే ఎట్లానని అనేవాళ్ళు. అయ్యో, నీ తప్పులేకుండా నీకి కష్టమంతా ఎందుకువచ్చింది అని సానుభూతిగా పరామర్శించేవాళ్లు ఎవరూ కనపడలేదు. ఏదోవిధంగా డబ్బు సంపాదించాలి, దాన్ని కర్చు పెట్టగలిగి ఉండాలి అనేవాళ్ళు తెలిసినవాళ్లూ తెలియనివాళ్లూ కూడా. ఒకరకంగా భవాని మంచిపనే చేసిందనాలి.

ఏమంటే, ఏ పాతికవేలో ముప్పయివేలో కట్నమిచ్చి నేను పెళ్ళి చేయ గలిగేవాణ్ణా?! అప్పో సప్పో చేదామన్నా నాకెవరిస్తారు? నీకు ఆశ్చర్యం అనిపిస్తూ ఉండవచ్చు. ఇంత ఆశాభంగంగా దిక్కు మొక్కూ లేకుండా కాలం గడుపుతున్నా వీడికి ఇంకా బతుకు మీద ఈ లంపటం ఎందు కని? ఈ ఆరోగ్య రక్షణ ఆరాటం ఎందుకని?

"చూడుబాబూ శోభనాచలం! నేను పోతే మా శాంత ఏమై పోవాలి? దానికి పెళ్ళి ఎలా కావాలి? మా కాలనీలో ఒక స్కూలుంది. స్కూలు నడిపిన చతురుడు పదేళ్ళలో లక్షాధికారి అయినాడు. సైకిలు మీద తిరిగినవాడు కారు సంపాదించాడు. ఆ స్కూల్లో మా శాంత పని చేస్తుంది. ఐదేళ్ళనుంచి ఒక్క పైసా పెంచలేదు జీతం. పని మాత్రం ఐదింత లెక్కువైంది. ఆ కాలక్షేపం కూడా లేకపోతే నా ఎదురుగా నన్ను చూస్తూ ఎలా గడుపుతుంది? నాకోసం ఎంత తాపత్రయమో! ఒక్కరోజు కాస్త ఆలస్యంగా నిద్రలేస్తే కంగారుపడి పోతుంది. దాని కోసమే 5 గంటలకల్లా లేస్తాను. కాళ్ళకి బూట్లు తొడుక్కుని లేసులు బిగిస్తాను. చేతిలో ట్రాన్సిస్టరూ, ఊతకర్రా తీసుకుంటాను. రెండు కిలోమీటర్లు నడిచి మళ్ళీ వచ్చేప్పుడు పూర్తిగా చెమటతో తడవటానికి చిన్నపరుగు పుచ్చుకుంటాను. నేనింట్లో అడుగు పెట్టేసరికి తన స్నానం పూజా అయిపోయి కాఫీ తెచ్చి యిస్తుంది. మొగమంతా కళాకాంతులతో తృప్తితో నా చెమట తుడుస్తుంది. ఏమయ్యా శోభనాచలం! ఇప్పుడు చెప్పు. నేను దాని తండ్రినా? అది నా తల్లా? చెప్పవేం-చెప్పు. నేనింకా కొంతకాలం బతకవద్దా? తండ్రిలా దాన్ని చూసుకొనే వాడికోసం వెతక వద్దా? ఇక్కడే గజానన కాలనీలో షెప్పర్డు స్కూలు పక్కన మా యిల్లు. ఒకసారి రా. పాపం, పొద్దెక్కుతున్నది. నువ్వెళ్ళు. నేను కూడా వెళతానులే. పరవాలేదు" అన్నాడాయన వగరుస్తూ. చెమటతో వీపు తడవక పోయినా చెమ్మతో కళ్ళు మసకలు కమ్మాయి ఇవాళ శోభనాచలానికి.

(సోవియట్ లాండ్ - 1990)